క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ రామాపురం ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కె.సైదయ్య ఆదివారం తెలిపారు. దీంతో రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

పాలకవీడు ఎస్‌ఐగా కోటేష్ బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐగా బాధ్యతలు చేపడుతున్న కోటేష్

పాలకవీడు : మండల ఎస్‌ఐగా ఆర్.కోటేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మీనర్సయ్య బదిలీపై భువనగిరి టౌన్‌కు వెళ్లగా ఆయన స్థానంలో నల్లగొండ జిల్లా నేరేడేగొమ్మ ఎస్‌ఐగా పనిచేస్తూ పాలకవీడు ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నేరేడుచర్ల : పట్టణానికి చెందిన ఎస్‌కె గౌస్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.52వేల500 చెక్కును స్థానికంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మత్స్య పరిశ్రమ చైర్మన్ పేరబోయిన వీరయ్య, నేరేడుచర్ల బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగిలి వెంకటేశ్వర్లు, నాయకులు కొనతం రాంరెడ్డి, నాగరాజు, శ్రీకాంత్, జాను, వాసు తదితరులున్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర


అమ్మవారికి చీర, సారె, బోనాలు సమర్పిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని దీక్షిత్‌నగర్ కాలనీలో భక్తులు కనకదుర్గమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కనకదుర్గమ్మకు చీరే, సారె, బోనాలు సమర్పించి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మొక్కలు చెల్లించారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సంఘం నాయకులు

కోదాడరూరల్ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఎమ్మార్పీఎస్ నూతన గద్దె నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కర్ల కాంతారావు, గంధం పాండు, గంధం రామకృష్ణ, చీమ శ్రీనివాసరావు, గుండెపంగు రమేష్, కుదుముల లక్ష్మీనారాయణ, నెమ్మాది సురేష్, కర్ల విజయరావు తదితరులు ఉన్నారు.

సర్వారం చైర్మన్ ఎన్నిక అప్రజాస్వామ్యం

గరిడేపల్లి : మండలంలోని సర్వారం సహకార సంఘం చైర్మన్ ఎన్నిక అప్రజాస్వామ్యమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వారం సహకార సంఘంలో 13మంది సభ్యులుగాను బీఆర్‌ఎస్ తొమ్మిది మందితో వీరంరెడ్డి శంభిరెడ్డి ప్రజాస్వామ్య బద్ధంగా చైర్మన్‌గా ఎన్నికయ్యారని అన్నారు. రెండుసార్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస వీగిపోయి శంభిరెడ్డి నెగ్గినప్పటికీ సొసైటీని రద్దు చేయడం చట్టానికి వ్యతిరేకమన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన కమిటీని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డీసీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఆర్టీసీ బస్సులను కేటాయించాలి

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలలకు ఆర్టీసీ బస్సులను కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు అవిరెండ్ల నాగేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రాలకు రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది ప్రభుత్వ పాఠశాలలకు పంపలేక ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారని అన్నారు.

కంకర పరిచారు .. బీటీ మరిచారు

- ముసిఒడ్డు సింగారం రోడ్డుకు రూ.కోటి 90లక్షలు మంజూరు
- బీటీ నిర్మాణానికి రెండు నెలల క్రితం పనులు ప్రారంభం
- కంకర పరిచి వదిలేసిన కాంట్రాక్టర్
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


కంకర పరిచి వదిలేసిన ముసిఒడ్డు సింగారం రోడ్డు

నేరేడుచర్ల : జడ్చర్ల– కోదాడ జాతీయ ప్రధాన రహదారి నుంచి నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామగిరి నుంచి ముసిఒడ్డు సింగారం తండా వరకు రెండు కిలోమీటర్ల మేరకు చేపట్టిన బీటీరోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.కోటి 90లక్షలు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం పనులు ప్రారంభించి రోడ్డుపై కంకర పరిచి వదిలేశారు. నేటి వరకు బీటీ నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ కంకర రోడ్డుపై వాహనాల రాకపోకలతో దుమ్ము, దూళిలతో ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు రాత్రి వేళల్లో రోడ్డు గుండా వెళ్లేటప్పుడు కంకర పరిచిఉండడంతో అదుపు తప్పి కిందపడి ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రతి నిత్యం ముసిఒడ్డు సింగారం తండా, రామకృష్ణతండా, పుల్లంబండ తండా, జగనాతండాలకు చెందిన ప్రజలు ప్రతినిత్యం మిర్యాలగూడ, నేరేడుచర్లకు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు తమ వ్యవసాయం ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఈ రోడ్డు మార్గం ద్వారానే వెళ్తుంటారు. అదే విధంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కూడా ఈ రోడ్డు మార్గం నుంచి ఆటోలు, బైక్‌లపై ప్రయాణిస్తుంటారు. రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించాలని పలు సందర్భాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా వదిలివేసిన బీటీరోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేయాలి



నేరేడుచర్ల నుంచి ముసిఒడ్డు సింగారం తండా వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ రోడ్డుకు కంకరపోసి వదిలేశారు. ఇప్పటి వరకు బీటీరోడ్డు వేయకపోవడంతో రోడ్డుపై కంకర తెలి దుమ్ముదూళితో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో కంకర రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నాము.

– బానోతు శ్రీనునాయక్, రామకృష్ణతండా

ప్రపంచ వ్యాప్తంగా లయన్స్‌క్లబ్ సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

నేరేడుచర్ల : ప్రపంచ వ్యాప్తంగా 47వేల క్లబ్‌లతో లక్ష 40వేల సభ్యత్వాలతో లయన్స్‌క్లబ్ సేవలు విస్తరింపజేసినట్లు లయన్స్‌క్లబ్ మల్టీపుల్ జీఎస్టీ కోఆర్డినేటర్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ 25వ నూతన కార్యవర్గ ప్రమాణాస్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లయన్స్‌క్లబ్ సభ్యత్వంలో భారతదేశం, అమెరికా దేశానికి మించి అగ్రగామిగా నిలిచిందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాదిలో అధికంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యూసుఫ్, కోశాధికారిగా నాగేశ్వర్‌రావుతో పాటు కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ 1వ డిస్ట్రిక్ గవర్నర్ కేవీ ప్రసాద్, రెండో డిస్ట్రిక్ గవర్నర్ సతీష్‌కుమార్, కొండ సంతోష్, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, నాగయ్య, బట్టు మధు, ప్రభాకర్‌రెడ్డి, సత్యానారాయణరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, క్రాంతికుమార్, రాంమోహన్‌రావు, ఆదిరెడ్డి విశ్వనాథం, అంజయ్య, రమేష్‌బాబు, కృష్ణారెడ్డి, నవీన్, నాగార్జున తదితరులున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మునగాల : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆదివారం స్థానికంగా పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. యువత సైబర్ నేరాల పట్ల అవగామన కలిగి ఉండాలని, సెల్‌ఫోన్ వినియోగాన్ని అవసరం మేరకే ఉపయోగించాలని కోరారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, పిన్ నంబర్, ఇతర సమాచారం ఇవ్వొద్దని అన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


మోతె : రైతులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మోతె : మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ఆదివారం మండల పరిధిలో అన్నారిగూడెం, రాఘవాపురం ఎక్స్‌రోడ్డు, సర్వారం గ్రామాల్లో ఆమె పర్యటించారు. అన్నారిగూడెం గ్రామశివారులో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లేందుకు దారిలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఆమె అందుకు స్పందించి సంబంధిత సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం బీక్యాతండా వాసులు ఎమ్మెల్యేను కలిసి తండాకు–మోతె గ్రామాలకు వెళ్లే కంకరరోడ్డును బీటీరోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుల్లారావు, నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పులి ఈదయ్య, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఎలుగు వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

అనంతగిరి : ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 860లో రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ నూనత భవనం ప్లానింగ్ రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లానింగ్‌లో పూర్తి వివరాలు లేకపోవడంతో వాటిని ప్లానింగ్‌లో పొందుపరచాలని ఆదేశించారు. నూతన మండలంలో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ నూతన భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్థలాల సేకరణ పూర్తిఅయినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ భవనానికి రూ.2.4కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం త్రిపురవరంలో పెద్దమ్మతల్లి జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ కే.హిమబిందు, ఆర్ అండ్‌బీ డీఈ పవన్‌కుమార్, ఎంపీడీఓ వీవీ రామచంద్రరావు, ఆర్‌ఐ వెంకటనగేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, బాణోతు బాబునాయక్, డేగ కొండయ్య, ఈదుల కృష్ణయ్య, గుర్రం వెంకటరెడ్డి, వేనేపల్లి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నర్సింహరావు, ఉమా శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రెడ్డి నిత్యాన్నదాన సత్రంలో ఫంక్షన్ హాల్ ప్రారంభం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్న సత్రంలో నూతనంగా దాతల సహకారంతోరూ.75లక్షలతో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఆదివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుణ్యక్షేత్రంలో భక్తులకు భోజన వసతి కల్పించడం ఆనందదాయకమన్నారు. అదే విధంగా సత్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గోశాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సత్ర కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి, సాముల శివారెడ్డి, సమ్మిడి స్వరూపరెడ్డి, జి.ఆనందరెడ్డి, నాగిరెడ్డి, సాదారెడ్డి, ప్రసాదరెడ్డి, శంభిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మట్టపల్లిలో రెడ్డి అన్నదాన సత్రంలో ఫంక్షన్‌హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

హుజూర్‌నగర్ : పట్టణంలో రామాలయం, మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరహా లక్ష్మీనరసింహా వేణుగోపాలస్వామి వారి ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తులు ఏకనామం, భజనలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ పూజారులు, ధర్మకర్తల మండలి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గరిడేపల్లి, కీతవారిగూడెం, పోనుగోడు రామాలయం, శివాలయాలతో పాటు పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరిడేపల్లి లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సంవత్సరం తొలి పండుగ కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం పట్టణం, మండలంలోని ఆయా ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పలు ఆలయాలు, దేవాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. శ్రీకోదండ రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆమంచి ఉపేంద్రశర్మ వేద మంత్రోత్సవాల మధ్య పూజలు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని సోమప్ప దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇటువంటి శ్రీనివాసశాస్త్రీ వేదమంత్రోత్సవాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోదండ రామాలయం కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ఆలయ ధర్మకర్త రాచకొండ నాగమాధవరావు, ప్రధాన కార్యదర్శి రాచకొండ రాంమోహన్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మురారిశెట్టి రమేష్, కృపాకర్, సీతారాంరెడ్డి, సుబ్బారావు, గుండా సత్యనారాయణ, సూదయ్య, గోపాల్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణరెడ్డి, సీతారాంరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, నటరాజ్, భరత్, శ్రీనివాస్, శేఖర్, వెంకట్‌రెడ్డి, అశోక్ తదితరులున్నారు.


హుజూర్‌నగర్ : రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.


మేళ్లచెరువు : శివాలయంలో భక్తులకు హారతినిస్తున్న అర్చకుడు

మేళ్లచెరువు : తొలి ఏకాదశిని పురస్కరించుకొని మండల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంతో పాటు శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


నేరేడుచర్లలోని కోదండ రామాలయంలో..


హుజూర్‌నగర్ : బూరుగడ్డ ఆలయంలో..

రాజనీతిజ్ఞుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ


హుజూర్‌నగర్ : డాక్టర్ శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : జాతీయ ఐక్యతకు, దేశ ఉజ్వల భవిష్యత్‌కు పాటుపడిన రాజనీతిజ్ఞుడు, విద్యావేత్త భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హరీష్ మాట్లాడారు. దేశంలో ఒకే జెండా, ఒకే ప్రధాని, ఒకే రాజ్యాంగం ఉండాలని పోరాడిన మహనీయుడు ముఖర్జీ అని అన్నారు. ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, ఉపాధ్యక్షుడు విజయ్, కార్యదర్శి హరీష్, పులి నరసింహారావు, జగన్ పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం విద్యావేత్త డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొండ శ్రీను, ఉపాధ్యక్షుడు వన్నాపురం సతీష్, కొడారు రాము, దళిత మోర్చా నాయకుడు మట్టయ్య, బుడిగె వీరబాబు, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయవాది శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, జిల్లా నాయకులు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, శంకర్‌రెడ్డి, నాగయ్య, జూలూరు అశోక్, శావయ్య, నాగమణి, నాగేశ్వర్‌రావు, కృష్ణవేణి, మధుసూధన్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, రఘునాధరెడ్డి తదితరులున్నారు.


చిలుకూరు : నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


నేరేడుచర్లలో ..

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి


చిలుకూరు : నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కోసం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు వడ్డేపల్లి కోటేష్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, మాతంగి వీరస్వామి మాదిగ, కందుకూరి కృష్ణమూర్తి, కాంపాటి రంజిత్, లచ్చయ్య, సాయి, లక్ష్మణ్, సిద్దు, స్వామి, సంతోష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గరిడేపల్లి, కుత్బుషాపురం, గానుగబండ, కట్టవారిగూడెంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల సావడిల వద్ద ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కొబ్బరి కుడకలు, ప్రసాదం అందించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో ఆదివారం మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లను ఊరేగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మొహరం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బరాఖత్‌గూడెంలో ముస్లింలు పీర్లకు దట్టీలు కట్టి, ఊదుబెల్లంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అన్వర్ బాసైదా, సభ్యులు అబ్దుల్‌కలామ్, నాగుల్ పాషా, భిక్షం, వీరస్వామి, నర్సయ్య ఖాసీం, రఫీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి, నాయకులు

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ : పట్టణంలో జరుగుతున్న పీర్ల పండుగ చివరి రోజు (మొహర్రం) వేడుకల్లో ఆదివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముజావర్లు ఆమెను పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పీర్ల ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని గుండం చుట్టూ ప్రదక్షణలు చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్, నాయకులు జక్కుల మల్లయ్య, కోడి ఉపేందర్, చప్పిడి సావిత్రి, సైదా మేస్త్రీ, వల్లపుదాస్ కృష్ణ, కోల్లపూడి యోహాన్, లచ్చిమల్ల నాగేశ్వరరావు, గణేష్, శ్రీనివాస్, యూసఫ్, రామారావు, వెంకటేశ్వర్లు, శివ, వీరబాబు, కోటమ్మ, యల్లయ్య, వినయ్, రమేష్ పాల్గొన్నారు.


గరిడేపల్లిలో పీర్ల ఊరేగింపు


మునగాల : బరాఖత్‌గూడెంలో..

సమాజ హితమైన బోధనతోనే ఉత్తమ సమాజం


గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న మన్నె గణేష్

నేరేడుచర్ల : సమాజ హితమైన బోధనతోనే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని ఆర్‌ఎస్‌ఎస్ నల్లగొండ విభాగ్ శారీరక్ ప్రముఖ్ మన్నె గణేష్ అన్నారు. ఆదివారం స్థానిక కోదండ రామాలయంలో ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వార్థం లేని సమాజం ఏర్పాటు కావాలని స్వామి వివేకానంద బోధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి పెదరామిరెడ్డి, మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, రాము, మాశెట్టి మోహన్, వీరవల్లి కోటేశ్వర్‌రావు, గెల్లి శ్రీను, కొణతం సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వాసు, కందిబండ రవి, శ్రీనివాస్, సతీష్, సుబ్రహ్మణ్యం, శేఖర్, మధు, సీతారాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, అంజయ్య, నాగ మాధవరావు, సుబ్బారావు, రమేష్, కృపాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీరాంమ్మూర్తి, సత్యనారాయణరెడ్డి, సీతారాంరెడ్డి, సైదయ్య, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మునగాల : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్షం సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, బీఆర్‌ఎస్ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, సీపీఎం నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ నాయకులు కాసర్ల బోస్, సీఐటీయూ మండల కార్యదర్శి బచ్చలకూరి స్వరాజ్యం, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సారెడ్డి రాఘవరెడ్డి, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని వివిధ సిమెంట్ పరిశ్రమ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ వట్టెపు సైదులు, మండల కన్వీనర్ సయ్యద్‌రన్ మియా, నాయకులు జోసు, మహమ్మద్, సక్రు నాయక్, చందునాయుడు, బాశౌరి పాల్గొన్నారు.

కోదాడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ఐక్యకార్మిక సంఘాల సమావేశంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మేకల శ్రీనివాసరావు, మిట్టగడుపుల ముత్యాలు, ఎస్‌కె.నయీం, ఉప్పు శ్రీను, నరసింహరావు, మెగిలిచర్ల అంజయ్య, ఎస్‌కె.లత్తు పాల్గొన్నారు.

కార్మికులు, రైతులపై దాడి తీవ్రతరం

హుజూర్‌నగర్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు, రైతులపై దాడి తీవ్రతరం చేసిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం హనుమాన్ లింగయ్య భవన్‌లో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మారుడి శ్రీనివాసరెడ్డి, జెట్టి ప్రసాద్, ఎస్‌కె హుస్సేన్, రాఘవరెడ్డి, శ్రీనివాస్, రవి, రమణ, అంజయ్య పాల్గొన్నారు.